# 2. జీవితంలో ఒక రాత్రి

ఆఫీసునుంచి కొంచెం ఆలస్యంగా వచ్చిన సీత సరాసరి డాబా మీదికి వెళ్లింది. చీర మార్చుకోలేదు. ముఖమైనా కడుక్కోలేదు.

కట్టలు తెగిన ప్రవాహంలా పొంగిపొరలివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. చీరకొంగుతో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

సీత రావడం, ఏకాయెకి డాబామీదికి వెళ్లడం చూచింది, మొక్కలకు నీళ్లు పోస్తున్న తల్లి. ఎందుకో అనుకొని, యేమీ మాట్లాడలేదు. అన్ని మొక్కలకూ నీళ్లు పోసి, స్నానం చేసి, వంటింట్లోకి వెడుతూ—

'పెద్దమ్మాయ్' అని పిలిచింది. జవాబు రాలేదు.

'పెద్దమ్మాయ్.'

ఈసారి పిలుపులో అసహనం తొంగిచూచింది.

చిన్నమ్మాయి విమల బదులు చెప్పింది. 'ఇవాళెందుకో అక్కయ్య యింకా రాలేదమ్మా.'

'రాకపోవడ మేమిటే, డాబామీద వుంటేను.'

పైకివెళ్లిన విమల రెండు నిమిషాలయినా కిందికి రాలేదు.

'నువ్వూ అక్కడే కూలబడ్డావుటే.' పైకి గంభీరంగా అంది కాని, ఆమె కెందుకో సందేహం కలిగింది. పైకి వెళ్లి

స్వయంగా కారణం తెలుసుకుందామని, మూడు మెట్లు ఎక్కింది. విమల ఎదురుగా వస్తోంది. 'అక్కయ్య ఎందుకో యేడుస్తోంది' అని చెప్పింది, కళ్ల నీళ్లు గుక్కుకుంటూ.

జరగకూడనిదేదో జరిగివుంటుంది. అందుకే ఏడుస్తోంది— అనుకుంది తల్లి. ఎలాగో మనస్సుని చిక్కబట్టుకుని, గబగబా మెట్లెక్కింది.

పెద్దమ్మాయిని చూచీ చూడడంతోనే ఆమె ఉలిక్కిపడింది. శోకదేవతలా ఉంది సీత. తల్లి దగ్గరికి రావడంతో, దుఃఖం మరీ ఎక్కువయింది.

'ఏం జరిగిందే తల్లీ? వచ్చినప్పట్నుంచీ యిలా యేడుస్తూ కూచున్నావుటే...' ఏదో తెలియని భయంతో ఆమె గుండె కొట్టుకుంది. మళ్లీ అడిగింది. 'ఏం జరిగిందో చెప్పవే.'

సీత మెల్లగా తల పైకెత్తింది. కళ్లు జ్యోతుల్లా ఉన్నాయి. ముఖం ఉబ్బరించి వుంది.

'పొయ్యి మీద అన్నంపెట్టి వచ్చాగాని, వెళ్లి చూడు. అయినా నీ కిక్కడేం పనే' అంటూ అక్కడినుంచి చిన్నమ్మాయిని పంపించివేసింది తల్లి.

ఆమెకు ఆదుర్దా ఎక్కువయింది. ఓర్పు నశించింది. గుండె బద్దలు కొట్టినట్టుగా అడిగింది. 'చెప్పవే అమ్మా, ఏం జరగలేదు గదా?'

ఈ ప్రశ్న కటువుగా వినిపించింది సీతకు. కన్న కూతుర్ని తల్లి అడగవలసిన ప్రశ్న కాదనుకుంది. 'నామీద నీకు సందేహమా అమ్మా?' అడగలేక అడిగింది యీ మాట.

'అబ్బా...నన్ను చంపకు. అడిగిందానికి అవును, కాదు అని చెప్పరాదూ?'

'అలాంటిదేం జరగలేదమ్మా.'

పోయిన ప్రాణం వచ్చినట్లనిపించింది తల్లికి. గూడు కట్టుకున్న సందేహం కాస్తా తొలగిపోయింది. మనస్సు కుదుటబడింది. మళ్లీ మామూలు తల్లి అయింది.

'అయితే ఎందుకే యిలా యేడుస్తున్నావ్?'

'ఆయన కనిపించారమ్మా...'

'ఎప్పుడు?' ఆదుర్దాగా అడిగింది.

'ఆఫీసు నుంచి వస్తుంటే దార్లో...'

'కొంపదీసి, మళ్లీ రమ్మన్లేదుగదా...ఏం మొహం పెట్టుకుని వచ్చాడట యీ వూరికి' అని ఆరంభించి, 'యింతకూ నీ రాత యిలా వుంది. లేకపోతే దొరకక దొరకక మనకీ ముష్టి సంబంధమే దొరకాలి' అని ముగించింది.

సీత రోజూ వినే మాటలే యివి. అయితే పట్టించుకునేది కాదు. కాని యివాళెందుకో తల్లిని ఒక సంగతి అడగాలనుకుంది. ధైర్యం చేసింది.

'అమ్మా, ఒకటడుగుతాను. కోప్పడవుగదా!'

'పిచ్చి తల్లి! నీఖర్మ యిలా కాలిందే అని యెంతగా కుమిలి పోతున్నానో నీకేం తెలుసు? నిన్ను చూసి యేడవనా? లేకపోతే మీనాన్న మొండితనం చూసి యేడవనా? ఈ యింట్లో నామాట వినేదెవరమ్మా...'

తల్లి కళ్లల్లో నీళ్లు తిరగడం చూచి సీత బాధపడింది. ఆమె విసుక్కునేటప్పుడూ, పని తొందరలో కేకలు వేసేటప్పుడూ

సీత అనుకునేది. 'అమ్మకు ఓర్పు తక్కువ. మహా తొందర మనిషి' అని.

తల్లిని పరీక్షగా చూచేకొద్దీ తన అభిప్రాయాన్ని మార్చుకోవాలనిపించింది సీతకు.

'అమ్మా, యేడవకు.'

'ఏడవక యింక చేసేదేముంది. ఆ రోజు నెత్తీ నోరూ బాదుకున్నా, యీ ముష్టి సంబంధం వద్దండీ అని. ఆయన నామాట వింటేనా? ఆడవాళ్లెప్పుడూ అపశకునాలే పలుకుతారంటూ నామీద విరుచుకుపడ్డారు, నలుగుర్లోను...'

'ఇప్పుడదంతా యెందుకులే అమ్మా.'

'అంత తేలిగ్గా యెలా మరిచిపోను...ఇంకా యిరవై యేళ్లన్నా నిండలేదు నీకు...ఎలా గడుస్తుందే నీ జీవితం...'

సీత తల వంచుకుంది.

'మేమున్నంతకాలం నీకు లోటు రాదనుకో. ఆతర్వాత... తర్వాత...'

తల్లి సీతను కౌగిలించుకుని యేడ్చింది. అవును—అమ్మ అన్నట్లు, తన జీవితం ఎలా గడుస్తుంది? తనది ఒంటరి బతుకయిపోయింది. ఏమీ తోచలేదు. సీత తల్లి మాటల్ని మననం చేసుకోసాగింది.

'చూడమ్మా, నువ్వేమీ ఆ దిగులు పెట్టుకోకు. నేనున్నానుగా.' అంత దుఃఖాన్ని ఎలాగో దిగమింగి ధైర్యం చెప్పింది తల్లి. ఒక్క క్షణం ఆగి, 'అది సరే, యిందాకట్నుంచీ నువ్వు ఎందుకేడుస్తున్నట్టు?' అని అడిగింది.

'రామాలయం దగ్గర ఆయన కనిపించారు...'

'నడిబజార్లో నోటికొచ్చినట్టు యేవఁన్నా మాట్లాడా డా యేవిఁటి?'

'నన్ను చూసికూడా చూడనట్టు నటించారు.'

'అందుకా నువ్వు యింత యిదయిపోయి యేడుస్తున్నావ్?'

'అందు కాదమ్మా...ఆయన వెనకాల యెవరో ఒక అమ్మాయి వుంది. ఇద్దరూ గుళ్లోకి వెళ్లారు.'

'ఆఁ' అంటూ కుప్పలా కూలిపోయింది, అంతవరకూ గంభీ రంగా వున్న తల్లి.

ఈ విషయం అమ్మకు ఎందుకు చెప్పానా అని బాధపడింది సీత.

'అంతపనీ చేశాట్ట ఆ త్రాష్టుడు...అంతా కలిసి నీ గొంతు కోశాఁవమ్మా.'

'ఏవిఁటమ్మా, నువ్వంటున్నది?'

'మొన్న వెంకాయమ్మగారు సందేహంగా చెబితే, ఏమో అనుకున్నా...నిజమే నన్నమాట...'

'ఏవిఁటమ్మా అది?'

'నా నోటితో ఎలా చెప్పను?'...వాడు...రెండో పెళ్లి...' అంటూ ఆమె లేచింది. ఆమెకు ఒళ్లంతా తేళ్లూ, జెర్రులూ పాకినట్లనిపించింది. ముళ్లమీద నుంచునట్టు తోచింది. కాళ్లకింద నేల కదులుతున్నట్టు కనిపించింది. మెట్లుదిగి, గేటు దాటి, పక్కవీధిలోకి దారి తీసింది.

'అమ్మా, అమ్మా' అంటూ కేకలు వేస్తూ సీత కిందికి వచ్చింది.

బిక్క మొహం వేసుకుని కూర్చున్న విమల అమాంతం లేచి, అక్కయ్య దగ్గరికి వెళ్లింది యేడుస్తూ. ఆ యేడుపులో జాలీ, బాధా క్షీరోదకాలవలె, పడుగు పేకలవలె కలిసి పోయినాయి.

సీతకూ దుఃఖం వచ్చింది, చెల్లెల్ని చూడగానే. కాని నిగ్రహించుకుంది. చెల్లెల్ని ఓదార్చింది. ఆమె తలను నిమురుతూ, గులాబి మొక్కల వైపుచూడసాగింది. రెండు మొక్కలవి. చిన్న మొక్క బాగా పూస్తుంది. అదంటే అమ్మకు చాలా యిష్టం. దానికి బోలెడు నీళ్లు పోస్తుంది. పెద్దమొక్క ఎందుకో పూయదు. కనుక అదంటే చిన్న చూపు.

ఆ మొక్కల్ని చూస్తున్నంత సేపూ సీత అనుకుంది. 'నా చెల్లెలి జీవితం ఆ చిన్న గులాబి మొక్కలా అందంగా వుండాలి; కలకలలాడుతూ వుండాలి.'

'అక్కయ్యా, ఎందుకే యేడుస్తున్నావ్ నువ్వు?' విమల అడిగింది, జాలిగా చూస్తూ.

అతికష్టం మీద చిరునవ్వు నవ్వి 'ఇందాక నువ్వెందుకు యేడ్చావు, చెప్పు' అడిగింది సీత.

'నిన్ను చూసేసరికి ఎందుకో యేడుపొచ్చింది.'

సీత మౌనం వహించింది.

గేటు చప్పుడయింది. ఆదుర్దాగా గేటువైపు చూసింది సీత.

రిక్షా దిగి నాన్న లోపలికి వస్తున్నాడు. ఆయన వెనకాల ఎవరో ఒకాయన ఉన్నారు.

'దయచేయండి రామయ్యగారు.'

నాన్నమాట చాలా నీరసంగా ఉంది. ఉత్సాహం లేదు.

అంతా అయోమయంగా కనిపించింది సీతకు. ఏదో విపరీతమైన భయం ఆమెని ఆవహించింది. గుండె దడదడ కొట్టుకోవడం మొదలుపెట్టింది. ఇక అక్కడ వుండలేక గది లోకి వెళ్ళిపోయింది.

ఉన్నట్టుండి, అక్కయ్యా అమ్మా నాన్నా విచారంగా కనిపించడం చూచి విమల భయపడింది. 'ఈ యింటి కేదో శని చుట్టుకుంది' అని అమ్మ అప్పుడప్పుడు అనేమాటలు గుర్తుకి వచ్చాయి. నిజంగానే శని చుట్టుకుంది కాబోలు—అనుకుంది. అంతకు తప్ప ఆమెకు అసలు సంగతి అంతు పట్టలేదు.

హాల్లో అడుగుపెడుతూనే నాన్న 'విమలా, అమ్మను పిలు' అన్నాడు.

'ఎక్కడికో వెళ్ళింది నాన్నా.'

'ఎందుకు?'

'ఏమో.'

ఇంతలో రామయ్యగారు తల ఆడిస్తూ, 'ఏవిఁటోనండి, కలికాలం' అన్నాడు.

'ఏం ద్రోహం చేశాను చెప్పండి వాళ్ళకు? అడిగినంత కట్నం యిచ్చా. అనుకున్న ప్రకారం వాళ్ళ అచ్చటా ముచ్చటా అన్నీ తీర్చాను. ఇదంతా నా స్తోమతకు మించిందే అనుకోండి...'

'మీరు చెప్పాలిటండీ, నాకు తెలీదు.'



ఆ.ప్ర. ... గ్రంథాలయం, ...
ప్రవేశ సంఖ్య 27999

'ఒకసారి పండక్కని అల్లుడొస్తే, ఎక్కడ లోపం జరుగుతుందో అని రెండువందల రూపాయలు పెట్టి సూటు కుట్టించా. వెళ్లేటప్పుడు ఫస్టుక్లాసు టికెట్టు కొనియిచ్చా. ఇదంతా నా దగ్గర డబ్బుండే చేశానుటండీ...ఏదో తమలాంటివాళ్లు, అప్పుగానే అనుకోండి, సమయానికి ఆదుకునేవాళ్లు. అమ్మాయి సుఖపడుతుంది గదా, సంతోషిస్తుంది గదా అని యివన్నీ చేశానుగానీండి, యిలా గొంతుకోస్తారనీ, అన్యాయంచేస్తారనీ కల్లో కూడా అనుకోలేదు...' అన్నాడు నాన్న.

విమల గదిలోకి వెళ్లింది.

మంచంమీద పడుకుని ఏడుస్తున్న అక్కయ్యను చూచి బావురుమంది.

'అక్కయ్యా, ఏం జరిగిందో చెప్పవూ?' చెప్పమని శత విధాల బతిమాలింది.

చెల్లెలి బుగ్గలమీద చారికలుకట్టిన కన్నీటిని చీరకొంగుతో తుడుస్తూ 'మీ బావ రెండో పెళ్లి చేసుకున్నారుట' అంది.

వెంటనే అడిగింది విమల. 'అయితే నువ్వు,'

'నేను మనింట్లోనే ఉంటానమ్మా.'

'బావ దగ్గరికి ఎప్పుడూ వెళ్లవా యింక?'

'లేదు.' అంటూ గోడకు తగిలించిన తన పెళ్లినాటి ఫోటో వంక చూపు నిలిపింది సీత.

పిచ్చిపిల్లమాదిరి అక్కయ్యను చూస్తూ అక్కడే కూర్చుంది విమల.

పెళ్లినాడు తాను పొందిన ఆనందంకంటె, తండ్రిపడ్డ యమ యాతన రంపపు కోత పెట్టింది సీత మనస్సుని...కట్నం తాలూకు ఏడువేలకు నాలుగువేలే చేతిలో వున్నాయి. తెల్లవారితే పెళ్లి. వచ్చిన చుట్టపక్కాలతో ఇల్లు సందడిగా వుంది. పెళ్లి పనులు చురుగ్గా సాగిపోతున్నాయి. పెండ్లి పందిరి చూడ ముచ్చట గొలుపుతోంది. ఒకవైపు పిండివంటల సువాసనలు, మరోవైపు బంధువుల సరస సల్లాపాలు. కాని నాన్న...నాన్నముఖంలో సంతోషం లేదు. ఏదో తప్పు చేసినవాడిలా కనిపించాడు. ఎవరైనా వచ్చి పలకరిస్తే, తెచ్చి పెట్టుకున్న సంతోషంతో ఆఁ, ఊఁ అనేవాడు. అంతే. డబ్బు కోసం తండ్రి పడుతున్న యాతన చూచి జాలిపడింది సీత. బాధపడింది సీత. అంతకంటె తాను ఏం చేస్తుందని?

ఆతర్వాత, పెళ్లికి వచ్చిన బంధువుల్లో ఒకరితో నాన్న అన్నమాటలు గుర్తుకి వచ్చాయి. 'మీ అమ్మాయే అనుకోండి. మీ వుపకారం నేనెన్నటికీ మరిచిపోను. నెల తిరక్కముందే ఎలాగైనా సరే, మీ మూడు వేలూ మీకు వడ్డీతోసహా యిచ్చేస్తాను. కట్నం పూర్తిగా యివ్వకపోతే, పెళ్లిపందిట్లోనే వాళ్లు యాగీ చేస్తారు. వాళ్లటువంటి మనుషులు...అమ్మాయి కంట తడిపెట్టుకుంటుంది. దానికి మహా అభిమానం...'

నాన్న యింత మొరపెట్టుకున్నా, ఆ బంధువు యేమీ మాట్లాడలేదు. అప్పుడు నాన్న ఆయన కాళ్లు పుచ్చుకుని మళ్లీ మొర పెట్టుకున్నాడు. పెళ్లినాడు భోజనాల ముందర, ఏదో ఒకవంక చెప్పి, మగపెళ్లివారు ఎంత గొడవ చేశారని... తిన్నంత పారేశారు—కూరలు, లడ్లు, అన్నం...బడిపంతులుగా

జీవితం సాగిస్తూ, చీమలా కూడబెట్టుకున్న డబ్బు ఆవిధంగా మట్టిపాలు కావడం చూచి నాన్న మనస్సు ఎంత క్షోభపడిందని... పాపం...

'అమ్మాయి గొంతు కోశానే' అంటూ నాన్న యేడవడం వినిపించింది, యింతలో.

సీత, విమల హాల్లోకి వచ్చారు.

అమ్మ అప్పుడే వచ్చినట్టుంది. ఆమె ముఖంలో నెత్తుటి చుక్క లేదు.

నాన్న యేడుపు చూడలేకపోయింది సీత. దగ్గరికి వెళ్లి 'ఊరుకో నాన్నా' అంది.

'మొదటినుంచీ యీ సంబంధం వద్దని మీ అమ్మ మొత్తుకుంటూనే వుంది. నేనే ఎవ్వరి మాటా వినకుండా నీకు అన్యాయం చేశానమ్మా ... కాని, యింత అఘాయిత్యం చేస్తారని నే ననుకోలేదు...'

తల వంచుకుని అమ్మ లోలోపల కుమిలిపోతోంది.

సీత వైపే చూస్తున్న రామయ్యగారు 'బంగారం లాంటి పిల్ల. పాడుబుద్ధి కాకపోతే...' అన్నాడు, కళ్లు తుడుచుకుంటూ.

'మా నాన్నగారు క్షయతో పోయారట. అప్పుడు నేను రెండేళ్ల పిల్లవాణ్ణి...అందుకని నాపిల్లను విడిచిపెట్టాలిటండీ... ఇది సబబేనా?' అన్నాడు నాన్న ఆవేశంతో.

'అదే పాడుబుద్ధంటేను. ఏదో ఒక వంక చెప్పాలిగదండీ మరి?'

'నాకు ఓపికలేదు. నా భార్యకు లేదు. మా అమ్మాయిలకు లేదు.'

'పోనీ, చదువుకున్నాడుగదా, మీ అల్లుడిగారికైనా బుద్ధి వుండద్దుటండీ' అన్నాడు రామయ్యగారు.

'అల్లుడు...ఏం చదువుకుంటే ఏం లాభం? తండ్రి యెంత చెబితే అంత. ఆయనా! తలలుమార్చే రకం. ఇవాళ మా స్కూలుకు వచ్చి నాతో అంటాడుగదండీ — మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చలేదు; కనక మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. మీ అమ్మాయి విషయమంటారా! అది మీ యిష్టం—ఇవేనా అరవై యేళ్ల పెద్దమనిషి చెప్పవలసిన మాటలు...'

'అమ్మాయి నచ్చలేదా?' అంది అంతవరకూ మౌనంగా వున్న తల్లి, ముక్కుమీద వేలు వేసుకుని.

'నచ్చలేదుట, ఆ నాలిముచ్చుకి.'

రెండు నిమిషాలు ఎవ్వరూ మాట్లాడలేదు.

గోడమీది గడియారం తొమ్మిది కొట్టింది.

'ఊఁ' అని నిట్టూర్పు విడిచి రామయ్యగారు లేచాడు.

'అమ్మాయిని చూశారుగా' అంటూ నాన్నకూడా లేచాడు.

'నిక్షేపంలాంటి పిల్ల' అన్నాడు రామయ్యగారు.

'వాళ్లతో చెప్పిచూడండి. ఎన్నటికీ మీ మేలు మరిచి పోను.'

'నాచేత నైనంత చెప్పిచూస్తాను. తర్వాత దైవసంకల్పం.'

రామయ్యగారిని పంపించి నాన్న లోపలికి వచ్చాడు.

'ఏవిటండీ మళ్లీను' అమ్మ అడిగింది.

'ఇది ఆఖరి ప్రయత్నం.'

'అమ్మాయిని కూడా ఏలుకోమనా?'

'అవును.'

'ఇంత రాద్ధాంతం జరిగిం తర్వాత, మళ్లీ అమ్మాయిని వాళ్ల యింటికి పంపిస్తామంటారా?'

'లేక చేసేదేముంది? దాని జీవితం ఎలా గడుస్తుంది? ఎవరు దానికి తోడూ నీడా?'

'అందుకని...నచ్చలేదనీ, టి.బి. అనీ, వంకపెట్టిన ఆ నాలి ముచ్చుల యింటికి నా అమ్మాయిని పంపించనా? నాకన్నా సిగ్గుండద్దూ?'

'ఏం చేస్తాం చెప్పు! ఆడపిల్ల నిచ్చుకున్నవాళ్లం; మనమైనా సర్దుకోకపోతే యెలా?'

'అలా అనుకుని అనుకునే, చివరి కిలా అయింది. మీ మెత్తదనం యింతదూరం తెచ్చింది. లేకపోతే వాళ్లా కారు కూతలు కూస్తారా? మీరెలా వింటూ కూచున్నారండీ?'

ఆయన యేమీ మాట్లాడలేదు.

ఏదో గుర్తుకి వచ్చినదానిలా, మళ్లీ ఆమె ప్రారంభించింది.

'ఒకవేళ వాళ్లు యేలుకుంటామన్నా సరే, అమ్మాయిని మాత్రం ఆ కొంపకు పంపించడం జరగదు. బంగారంలాంటి పిల్లకు వంకలు పెడతారా? ఆడపిల్ల నిచ్చుకున్నవాళ్లమయితే మాత్రం, చీము నెత్తుర్లు మనకూ లేవూ?'

'సరే, యిప్పుడేమంటావు నువ్వు?'

'మా మేనత్తకూతురు మళ్లీ పెళ్లి చేసుకుంది. ఆ సుబ్బమ్మ గారి మూడో అమ్మాయి మళ్లీ పెళ్లి చేసుకుని, యిద్దరు పిల్లల తల్లయింది. అలాగే...'

'ఏవిటలాగే...' అన్నాడు నాన్న కళ్లెర్రజేస్తూ.

అమ్మ యేమీ జంకలేదు. 'మన అమ్మాయిక్కూడా పెళ్లి చేద్దాం. అది యే పాపమూ యెరగదు' అంది.

ఎన్నడూ తనమాట కెదురుచెప్పని భార్య యిలా అనడంతో ఆయన నిర్ఘాంతపోయాడు; హతాశు డయ్యాడు.

'అమ్మా, నీకేవన్నా మతిపోయిందా?' అడిగింది సీత.

'అవును. నలుగురితో పాటు మనమూను. వాళ్ల కెవ్వారికీ లేని తప్పు మనకు మాత్రం వచ్చిందా యేవిటి?'

'నాకు మళ్లీ పెళ్లా—జరిగింది చాలదూ?'

'ఏ పాపమూ యెరగని నువ్వు బతికినన్నాళ్లూ ఉసూరు మంటూ కూచుంటే, చూస్తూ వూరుకోమంటావుటే నన్ను?'

ముందు వెనకలు చూడకుండా భార్య తెగించి మాట్లాడు తున్నందుకు, ఆయన లోలోపల విసుక్కున్నాడు. కాని పైకి యేమీ మాట్లాడలేదు.

సీత ఖచ్చితంగా చెప్పింది. 'నువ్వేమన్నా సరే, నేను మాత్రం చేసుకోను.'

అమ్మ యేదో చెప్పబోయింది.

'నేనేం ఆటవస్తువుని కాను, మీరు చెప్పిందానికల్లా ఆడ డానికి. పైగా సంఘాన్నెదిరించే ధైర్యం నాకు లేదు. మంచో

చెడ్డ అయిపోయింది. అంతా నా ఖర్మ...' అంటూ సీత గదిలోకి వెళ్లిపోయింది.

ఆ రాత్రి ఎవ్వరూ అన్నం తినలేదు. తినాలనీ అనిపించ లేదు.

నిద్రపోవాలని ప్రయత్నించింది సీత. కాని కునుకుపడితే ఒట్టు!

టైము రెండయింది. గులాబి మొక్కల దగ్గరికి వచ్చింది, ఏమీ తోచని సీత. అప్రయత్నంగా ఆమె చూపు పెద్ద మొక్కమీద పడింది. వెర్రిగా చూస్తూ కూర్చుంది. ఇంతలో అడుగుల సవ్వడి వినిపించింది. వెనక్కి తిరిగి చూసింది... నాన్న...

'ఏం నాన్నా?' అంది సీత.

'నువ్వు చెప్పినట్టు సంఘాన్నెదిరించే ధైర్యం నాకూ లేదు... కాని...ఎలా గడుస్తుందమ్మా నీ జీవితం? అమ్మ ధోరణి చూస్తే అలా వుంది...'